శరవేగంగా నాడు-నేడు పనులు


ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు


శంకర్‌నగర్‌లో జరుగుతున్న పనులు

ఆదోని సెంట్రల్: కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని రాష్ట్ర పభుత్వం నాడు-నేడు పనులకు శ్రీకారం చుట్టింది. విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, తాగునీరు, మూత్రశాలలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదోని పట్టణ, మండల పరిధిలోని పలు పాఠశాలల రూపురేఖలు ఇప్పటికే సమూలంగా మారాయి. రెండో దశ కింద మండలంలో 108 పాఠశాలల్లో నాడు నేడు పనులు జరుగుతున్నాయి. అందులో గ్రామీణ ప్రాంతంలో 59 పాఠశాలలు, పట్టణ ప్రాంతంలో 49 పాఠశాలలు ఉన్నాయి. ఈ పనుల కింద ప్రభుత్వం రూ.1436.99 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇప్పటి వరకు రూ.712.20 కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు వంటి సదుపాయాలతో పాటు అదనపు తరగతి గదులను కూడా నిర్మిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గదుల నిర్మాణంలో జాప్యం జరగకుండా, మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలలు పునఃప్రారంభంలోపు పనులు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అధికారులు సూచించడంతో వారి పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు పనులను వేగంగా చేయిస్తున్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో రూ. 66.7 లక్షలు, రెండవ వార్డులో ఉన్నత పాఠశాలకు రూ.59.47 లక్షలు, 18వ వార్డు ప్రాథమిక పాఠశాలకు రూ.14.05 లక్షలు, నాగనాథనహళ్లి ప్రాథమిక పాఠశాలకు రూ.19.53 లక్షలు అలసందగుత్తి ఉన్నత పాఠశాలకు రూ.48.4 లక్షలు, ధాణాపురం ఉన్నతపాఠశాలకు రూ.63.72 లక్షలు, మదిరె-111 ఉన్నత పాఠశాలకు రూ.59.47 లక్షలు నిధులతో ఆయా పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. గదులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపడుతున్నారు. కార్పొరేటు స్థాయికి దీటుగా ప్రభుత్వ బడుల రూపు రేఖలను మారుస్తున్నారు. ప్రతి పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రూ.20.84 లక్షలతో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు వివిధ పనుల కింద రూ.14.81 లక్షలు ఖర్చు చేశారు. మూత్రశాలలు ఫ్లంబింగ్, విద్యుత్, తాగునీరు, కళాశాలలో అక్కడక్కడా మరమ్మతుల పనులు చేస్తున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం



నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తాం. గదుల నిర్మాణంలో జాప్యం జరిగినా, నాణ్యత పాటించక పోయినా కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపేస్తాం. పాఠశాలలు తెరిచేలోగా మౌలిక వసతులు కల్పించేందుకు ఇప్పటికే హెచ్‌ఎంలకు సూచనలు ఇచ్చాం. కొన్ని పాఠశాలల్లో పనులు ముగింపు దశకు వచ్చాయి. వెనుకబడిన పాఠశాలల్లో త్వరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.
– బి.శివరాములు, మండలవిద్యాధికారి, ఆదోని

క్లుప్తంగా

అప్రమత్తతతో టీబీ నయం

ఆదోని టౌన్: క్షయవ్యాధి నివారణతో నయం చేసుకోవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు మంగళవారం తెలిపారు. హవన్నపేట, శంకర్‌నగర్‌లోని మాక్ సెంటర్‌లో సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గులో రక్తపు చారలు, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం రావడం ఉన్నట్లయితే అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నయం కోసం ప్రభుత్వం ఖరీదైన మందులను ఉచితంగా అందజేస్తుందన్నారు. పుట్టిన బిడ్డకు బీసీజీ వేయించాలన్నారు.

కర్ణాటక మేనిఫెస్టో బాబు కాపీ



మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాశ్

ఆదోని సెంట్రల్: అనుభవం ఉన్న నాయకుడనని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు కర్ణాటక మేనిఫెస్టోను కాపీ కొట్టడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం బాధ్యులు దేవిశెట్టి ప్రకాశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2014లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తరువాత దానిని విస్మరించారన్నారు. ఎలక్షన్లలో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ ఎండీ నైర్, యూత్ కాంగ్రెస్ నాయకులు తాయప్ప పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కోసిగి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాలలోని 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, డిప్యూటీ డీఈఓ యు.జె. సుకుమార్ తనిఖీ చేశారు. మంగళవారం మ్యాథ్స్ పరీక్షకు బాలుర పాఠశాలలో 227 మందికి గానూ 175 మంది హాజరు కాగా 52 మంది గైర్హాజరయ్యారు. మౌంట్ కార్మెల్ పాఠశాలలో 223 మందికి గానూ 175 మంది హాజ రు కాగా 48 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పరీక్షల చీఫ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట పరీక్షల చీఫ్‌లు శోభరాణి, లక్ష్మీనారాయణ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు రామాంజనేయ రెడ్డి, సిద్దప్ప ఉన్నారు.

12లోపు దరఖాస్తు చేసుకోండి


దరఖాస్తులను సిద్దలింగ మహాస్వామికి అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో శ్రీతోంటధార్య స్వామి మఠం ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి కన్నడ మీడియం విద్యార్థుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ఉచిత వసతి గృహంలో ప్రవేశాలకు ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని మఠం పీఠాధిపతి శ్రీ సిద్దలింగ మహాస్వామి సూచించారు. మంగళవారం పలువురు విద్యార్థుల దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల కన్నడ మీడియం స్కూళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు వసతి గృహంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు కూడా మండలంలో పేదరికంతో విద్యకు దూరమైన విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లోనూ, తమ వసతి గృహంలోనూ చేర్పించాలని కోరారు.

ఇస్వీ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా చిన్నపీరయ్య



ఆదోని రూరల్: మండల పరిధిలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా చిన్న పీరయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ విజయలక్ష్మి వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లడంతో త్రీటౌన్ ఎస్‌ఐ చిన్నపీరయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బైక్ చోరీ

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామానికి చెందిన కృష్ణకు చెందిన బైక్ (ఏపీ21ఏఎల్6325) చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాధితుడు ప్రతిరోజూ తన బైక్‌ను రైల్వే స్టేషన్ ఆరుబయట పార్కింగ్ చేసి ఉదయం 7 గంటలకు బీదర్ రైలులో రాయచూర్‌కు వెళ్లి అక్కడ పనులు చేసుకుని తిరిగి సాయంత్రం కోసిగికి వచ్చేవాడు. మంగళవారం కూడా యథావిధిగా స్టేషన్ బయట పార్కింగ్ చేసి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేలోపు బైక్ కనిపించకపోవడంతో చోరీకి గురైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

పాము కాటుకు వృద్ధురాలి మృతి

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో పాముకాటుకు వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జంగం బందెమ్మ (75)కు సోమవారం రాత్రి పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం నాటు వైద్యం అనంతరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది.

చెక్ బౌన్స్ కేసులో జైలుశిక్ష

ఆదోని రూరల్: ఎమ్మిగనూరు పట్టణం శారదా స్కూల్ ప్రాంతానికి చెందిన ఎం.కాశీంవలికి ఆదోని కోర్టు చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధించింది. మంగళవారం న్యాయవాది అబ్దుల్‌రశీద్ తెలిపిన వివరాలు.. 2016లో ఎం.కాశీంవలి ఆదోని పట్టణానికి చెందిన గుర్రెడ్డి వద్ద తీసుకున్న రూ.11.50 లక్షలు అప్పునకు ఇచ్చిన చెక్ బ్యాంకులో బౌన్స్ కావడంతో గుర్రెడ్డి కేసు వేశారు. ఆదోని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వీరవెంకటనాగలక్ష్మి విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి కాశీవలికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.11.50 లక్షల అప్పు చెల్లించాలని తీర్పునిచ్చారని న్యాయవాది అబ్దుల్‌రశీద్ విలేకరులకు తెలిపారు.

పశువైద్యం కోసం 1962కు కాల్ చేయండి

ఆదోని సెంట్రల్: పశువులకు అత్యవసర వైద్యం కోసం 1962 నంబర్‌కు కాల్ చేయాలని పశువైద్యుడు యం.విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పశువైద్యశాలలో మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులోభాగంగానే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించిందన్నారు. రైతులు తమ పశువులకు ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే కాల్ చేస్తే తమ సిబ్బంది వాహనంతో వచ్చి వైద్యం అందిస్తారన్నారు. అవసరమైతే వాహనంలో పశువులను సమీప పశువైద్య శాలకు తరలించి ఆపరేషన్ సైతం చేస్తామన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తం చేయండి


మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్ కుమార్

కోసిగి: అతిసార వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్ కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు గ్రామాల్లో ఉధృత అతిసార పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. వాంతులు, విరేచనాలు, డయేరియా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లతో కలిసి గ్రామాల్లో డ్రయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని కాచి, చల్లార్చి, వడబోసుకుని తాగాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రామకృష్ణ, పీహెచ్‌ఎన్ కోటేశ్వరరావు, సూపర్ వైజర్స్ నారాయణమ్మ, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌లో షాపుల నిర్మాణాలు, గౌరీగోపాల్ కాలనీలో బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులను నిర్ణయించిన సమయానికే పూర్తి చేయాలన్నారు. అనంతరం లేఅవుట్, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. డీఎస్పీ బంగ్లా రోడ్డు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఏరియాలోనూ ఖాళీ స్థలాల్లో క్లీన్ అండ్ గ్రీన్ పనులను చేశారు. ఎంఐజీ ట్యాంకు వద్ద వాటర్ వర్క్స్ సిబ్బంది హాజరు పట్టిక, డ్యూటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్ వెనుక, ఎదురుగా ఉన్న చిన్నపిల్లల పార్కులను తనిఖీ చేశారు. పార్కులలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించే పనులను పరిశీలించారు. పార్కులను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈయన వెంట ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ కృపాకర్, సిబ్బంది ఉన్నారు.

రూ.15 లక్షలతో తాగునీటి సౌకర్యం


మాట్లాడుతున్న సి.వి.విశ్వనాథ్‌రెడ్డి

మంత్రాలయం: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.15 లక్షల నిధులు కేటాయించినట్లు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సి.వి.విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మణిమంజరి, వైస్ ఎంపీపీలు పులికుక్క రాఘవేంద్ర, సింధుప్రియ, తహసీల్దార్ చంద్రశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీటి సమస్యతో పాటు చెట్నేహళ్లి గ్రామంలో శ్మశానికి వెళ్లే రహదారిని ఆక్రమించడంతో అంత్యక్రియలకు ఇబ్బందికరంగా మారిందని సర్పంచ్ అంజిని, ఎంపీటీసీ రామాంజనేయులు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన విశ్వనాథ్‌రెడ్డి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో త్వరలోనే సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఉరుములు, మెరుపుల కారణంగా మృత్యువాత పడిన మూగజీవాలకు రూ.30 వేల మేర నష్ట పరిహారం అందుతుందని, రైతులు ఆర్బీకేల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కల్లుదేవకుంట ఆస్పత్రికి తాగునీటి సౌకర్యం లేదని వెంటనే సౌకర్యం కల్పించాలని వైద్య సిబ్బంది కోరారు. ప్రభుత్వ స్కీంలకు సంబంధించి రూ.4 కోట్ల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయని ట్రాన్స్‌కో ఏఈ గోవిందు సమావేశంలో పేర్కొన్నారు. ఎక్కడైనా ప్రమాదకరంగా విద్యుత్ తీగలు, స్తంభాలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామన్నారు. చెట్నేహళ్లి, సుంకేశ్వరి గ్రామాల్లో ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం వచ్చిన సమస్యలను పరిష్కారించడం జరిగిందని ఏఈ వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ప్రభావతి, ఏపీఎం జయశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


గెలుపొందిన ఎద్దులను ఊరేగిస్తున్న గ్రామస్తులు


పరుగు పందెంలో గెలుపొందిన వారిని సన్మానిస్తున్న గ్రామ యువకులు

ఘనంగా ఏరువాక సంబరాలు


105 కేజీల ఇసుక బస్తాను ఎత్తుతున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి గ్రామాల్లో మంగళవారం రెండవ రోజున ఏరువాక సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. సాతనూరు గ్రామంలో ఉదయం పారువేటలో గెలుపొందిన కురువ అయ్యన్న ఎద్దులను పురవీధుల గుండా బీరప్ప స్వామి ఆలయం వరకు ఊరేగించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి సకాలంలో వర్షాలు కురిసి, సమృద్ధిగా పంటలు పండాలని స్వామి వారిని వేడుకున్నారు. సాయంత్రం పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. పరుగు పందెంలో కురువ వీరేష్, లాంగ్ జంప్‌లో కురువ రాజు విజేతలుగా నిలవడంతో వారిని శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. చిన్న భూంపల్లి గ్రామంలో సాయంత్రం పరుగు పందెం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారిని ఊరేగిస్తు సంబరాలు చేసుకున్నారు.

పెద్దకడబూరు: మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు కొనసాగుతున్నాయి. పెద్దకడబూరు మండల కేంద్రంలోని కురువ వీధిలోని నాగప్ప కట్ట దగ్గర మంగళవారం ఈ వేడుకలను యువత ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. వయసును బట్టి 50 కేజీల ఇసుక బస్తా నుంచి 105 కేజీల ఇసుక బస్తా వరకు ఎత్తి తమ సత్తా చాటారు. నక్కలమిట్ట చెన్నప్ప కుమారుడు నరసింహ 105 కేజీల ఇసుక బస్తాను ఎత్తి అందరిచేత శభాష్ అని అనిపించుకున్నాడు. పోటీలలో ప్రతిభ చాటిన యువకులను సన్మానించారు.

ఆర్డీటీకి మంత్రాలయం విద్యార్థి ఎంపిక


అశ్విని

మంత్రాలయం: ఆర్డీటీ ఆధ్వర్యంలో గత నెల 29న నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన అశ్విని ఎంపికైంది. అశ్వినిని విజయవాడలోని శ్రీ చైతన్య కాలేజీల్లో ఆర్డీటీ తరపున ఇంటర్ విద్యను ఉచితంగా చదివించనున్నారని పాఠశాల హెచ్‌ఎం హంపయ్య మంగళవాంరం తెలిపారు. అశ్వినిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

మంత్రాలయం: మండలంలోని అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం జయశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలోని 9 మండలాలకు చెందిన ఏపీఎంలతో వీఓఏలు, సీసీలకు పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలని కోరారు.

ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోండి


మాట్లాడుతున్న తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి

కౌతాళం: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుని త్వరగా ఇళ్లనిర్మానాలు పూర్తి చేసుకోవాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలోని జగనన్న కాలనీ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇంటి నిర్మాణం కోసం రూ.1.87 లక్షలు ఇస్తుందన్నారు. ఇప్పటికే ప్రారంభించిన ఇళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంకా ప్రారంభించని లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ, ఏపీఎం రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి

- డీఎస్పీ శివనారాయణస్వామి


మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: గ్రామాల్లో వివాదాల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని బసాపురం గ్రామంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు వస్తే వాటిని రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలకు వెళ్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించే వారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలు చేయరాదని, పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

ఆహారం విషతుల్యం

- విచ్చలవిడిగా కల్తీ
- యథేచ్ఛగా టేస్టింగ్ సాల్ట్, హానికర రసాయనాల వాడకం
- కల్తీ ఆహారం తింటే జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్, సంతాన లేమి సమస్యలు
- నేడు ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం


వ్యాపార కేంద్రంలో నూనెను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): తినే ఆహారం ఏదైనా శరీరానికి ఉపయోగపడాలి. చెడు చేయకూడదు. ప్రస్తుతం మనకు లభిస్తున్న ఆహారంలో అధిక శాతం వ్యాధులను కొనితెచ్చేవిగా ఉన్నాయి. నాణ్యతలేని, కల్తీ ఆహారం ఎక్కువగా లభిస్తోంది. ఫలితంగా మనిషి అనేక వ్యాధుల బారిన పడుతున్నాడు. ఈ నెల 7న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. జిల్లాలో దాదాపు 15వేలకు పైగా చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరుతిళ్ల కేంద్రాలు ఐస్‌క్రీమ్ కేంద్రాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఉన్నాయి. కర్నూలు నగరంలోనే 1800 దాకా హోటళ్లు ఉన్నాయి. ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి 2006 చట్టం మేరకు లైసెన్స్ తీసుకుని, ఆ శాఖ నిబంధనల మేరకు ఆయా వ్యాపార కేంద్రాలు ఆహారం తయారు చేయాలి. ఈ శాఖలో ఒక అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, డిస్ట్రిక్ట్ ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టులున్నాయి. ఒక్కొక్కరు నెలకు 12 ఆహార శ్యాంపిల్స్ సేకరించాలి. ఈ మేరకు గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 138 శ్యాంపిల్స్ సేకరించారు. వీటిని ల్యాబొరేటరీకి పంపగా అందులో 5 నకిలీ, ఆరు సబ్‌బ్రాండ్, 8 తినడానికి పనికిరానివిగా నివేదికలు వచ్చాయి.

టేస్టీ సాల్ట్, హానికర రంగుల వాడకం

జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో టేస్టీ సాల్ట్ (అజినోమోటో) విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం నిషేధించినా మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తుంది. వీటిని వేయకపోతే ఆహారం రుచిగా ఉండదని, కస్టమర్లు రారని నిర్వాహకులు బాహాటంగానే చెబుతున్నారు. మరోవైపు ఆహార పదార్థాల్లో బుష్ పౌడర్, మెటాలిక్ ఎల్లో రంగులను అధిక మోతాదులో వాడుతున్నారు. ఆహార పదార్థాల్లో బుష్ పౌడర్‌ను కిలోకు 0.001 మి.గ్రా వాడాలి. అయితే వ్యాపారులు ఆహార పదార్థా లు ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశంతో కిలోకు 10 నుంచి 20 మి.గ్రా కలుపుతున్నారు. ఈ రంగులు, టేస్టీ సాల్ట్‌ను కలిపిన ఆహారం తింటే క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, సంతానలేమి, సెక్స్ సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

పరిశుభ్రత గురించి పట్టింపు లేదు

పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహార పదార్థాలను విక్రయించడం చేస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేదు.

ఆహారంలో కల్తీ ఇలా...

- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపౌడర్లు, యూరియా, పిండి, నూనె కలుపుతున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు కలుపుతున్నారు. దీని వల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకల నుంచి ద్రావణం తీసి సాధారణ వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరిలో హానికర రంగులు వాడుతున్నారు. వీటితో పాటు అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకల మాంసం ఉపయోగిస్తున్నారు.
- నిషేధం ఉన్న క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నారు.
- మిరప పొడిలో ఎరుపు రంగు కోసం సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిక్ ఎల్లో పదార్థాన్ని కలుపుతారు.
- వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండడం ద్వారా క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీపాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారును పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి తినే వారికి అనారోగ్యం కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులో ఆలుగడ్డ, ఉల్లి పేస్ట్‌ను కలుపుతున్నారు.

కల్తీ చేశారని తెలిస్తే సమాచారమివ్వాలి



తినుబండారాలలో కల్తీ జరుగుతోందని తెలిస్తే సి.క్యాంపులో ఉన్న తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. లేదా 08518-229607కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చు. కల్తీ అని తేలితే సదరు వ్యాపారిపై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలాగే నాణ్యత లేకపోయినా, నిర్వాహకులకు అనుమతి లేకున్నా చర్యలు తప్పవు.
– కె.కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా

వ్యాపారులకు లైసెన్స్ తప్పనిసరి

ఆహారాన్ని విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే తనిఖీల్లో దొరికినప్పుడు సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తారు.

నిత్యావసర సరుకులు సాయం

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్ప పాళెంలో నివాసం ఉంటున్న వడ్డే బసమ్మ, లేట్ బొంబాయి తిక్కన్న దంపతుల రెండవ కుమార్తె యల్లమ్మ వివాహానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డిలు నిత్యావసర సరుకులు సాయం అందించారు. మంగళవారం ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ నాయకుడు కొరివి గోపాల్ క్వింటం బియ్యం, 10 లీటర్ల వంట నూనె, 5 కేజీల బేడలు అందించారు.

వికసించిన మే పుష్పం



మండల కేంద్రంలోని బాల వికాస్ ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో మంగళవారం మే పుష్పం వికసించి అందరినీ ఆకట్టుకుంది. ఏటా మే నెలలోనే వికసించే ఈ పుష్పం ఈ సారి కాస్త ఆలస్యంగా జూన్‌లో వికసిందని పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.
–పెద్దకడబూరు